ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 11 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

# జర్నలిస్టులపై దాడికి ఖండన

వరంగల్ : జర్నలిస్టులపై మోహన్ బాబు దాడిని ఖండిస్తూ వరంగల్ లో జర్నలిస్టు సంఘాలు హెల్మెట్లు ధరించి నిరసన తెలిపాయి. హెల్మెట్లు ధరించి కవరేజ్ కు వెళ్లాలా అంటూ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. జర్నలిస్టులపై దాడులు చేయడం పరిపాటైందన్నారు. పోలీసులు నటుడు మోహన్ బాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడిని తీవ్రంగా ఖండన తెలిపారు.



# కనులపండువగా పున:ప్రతిష్ఠ



### హాజరైన మంత్రులు సురేఖ, పొన్నం

హైదరాబాద్: కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పున:ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ లు హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ముత్యాలమ్మ అమ్మవారికి మంత్రి కొండా సురేఖ పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా అమ్మవారి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయడం సంతోషంగా ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ముత్యాలమ్మ దేవాలయం వద్ద మోండా మార్కెట్ భాజపా కార్పొరేటర్ దీపికకు సంబంధించిన బ్యానర్లు జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించడంపై ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడడం మానేసి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు

# నాన్న ఆరోగ్యం స్థిమితంగా లేదు

### మంచు విష్ణు

**హైదరాబాద్ : హైదరాబాదు, జల్పల్లిలోని తన ఇంటి వద్ద మోహన్ బాబు మీడియా ప్రతినిధిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. నిన్న రాత్రి జరిగిన నాటకీయ పరిణామాల మధ్య మనోజ్ తో పాటు జర్నలిస్ట్ పై దాడి అనంతరం మోహన్ బాబు, మంచు విష్ణు ను పోలీసులు అక్కడి నుంచి బయటకు పంపేశారు. అయితే ఈరోజు ఉదయం విచారణకు హాజరు కావాలంటూ రాచకొండ సిపి మోహన్ బాబుకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మంచు విష్ణు పోలీసులకు నుంచి తమకు అందిన నోటీసులపై స్పందించారు.**






మోహన్ బాబు తలకు గాయమైంది అంటూ నిన్న రాత్రి గచ్చిబౌలి కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మోహన్ బాబు హెల్త్ బులెటిన్ ను రిలీజ్ చేశారు వైద్యులు. మోహన్ బాబు ఆరోగ్యం స్థిమితంగా లేదని, మానసికంగా బాధపడుతున్నారని, అసలేం జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నారని వైద్యులు వెల్లడించారు. అంతేకాకుండా ఆయన ఎడమ కంటి కింద గాయం అయిందని, కుడి వైపు కంటి కింద వాపు ఉందని, సిటీ స్కాన్ చేయబోతున్నామని వివరించారు కాంటినెంటల్ వైద్యులు.

**ఇక ఆ తర్వాత మంచు విష్ణు మీడియాతో మాట్లాడుతూ నిన్న జరిగిన ఘటనపై స్పందించారు. "కలిసి మెలిసి ఉంటాం అనుకున్నప్పటికీ ఇలా జరిగింది. మేము పబ్లిక్ ఫిగర్స్, మా న్యూస్ ను మీరు పబ్లిక్ లోకి తీసుకెళ్లాలి అనుకుంటున్నారు. కానీ కొంతమంది లిమిట్స్ క్రాస్ అవుతున్నారు. షూటింగ్లో ఉన్నప్పుడు ఇంట్లో గొడవలు జరుగుతున్నట్టుగా నాకు ఫోన్ వచ్చింది. అందుకే అన్ని వదిలేసి వచ్చేసా. నిన్న రాత్రి జరిగిన గొడవలో టీవీ రిపోర్టర్ కు గాయాలు అవ్వడం అనేది కావాలని చేసింది కాదు. మనోజ్ గేటు పగలగొట్టుకొని ముందుకు రావడం వల్ల ఆయన అలా రియాక్ట్ అయ్యారు. విజువల్స్ ని సరిగ్గా గమనిస్తే ముందు నమస్కారం పెడుతూ ముందుకు వచ్చారు ఆయన. కానీ ఆ హీట్ మూమెంట్ లో అలా జరిగింది" అంటూ తన తండ్రి తప్పేం లేదన్నట్టుగా మాట్లాడారు.**

### హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్

అయితే అందులో భాగంగానే తమకు పోలీస్ అధికారుల నుంచి వచ్చిన నోటీసుల గురించి కూడా మాట్లాడారు విష్ణు "లా ప్రకారం నాకు వచ్చిన నోటీసులకు నేను రెస్పాండ్ అవ్వాల్సిన పనిలేదు. 9:30 కి నోటీసులు ఇచ్చి 10:30 కి విచారణకు రావాలి అంటే ఎలా వస్తారు?" అంటూ తిరిగి ప్రశ్నించారు మంచు విష్ణు. మరోవైపు మోహన్ బాబు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తన ఇంటి వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని, ఇంతకుముందే సెక్యూరిటీ కోరినప్పటికీ పోలీసులు తనకు భద్రతను కల్పించలేదని అందులో పేర్కొన్నారు. వెంటనే తనకు భద్రత కల్పించాలంటూ ఆ పిటిషన్ లో మోహన్ బాబు కోరినట్టుగా తెలుస్తోంది. మోహన్ బాబు తరపున సీనియర్ న్యాయవాదులు నగేష్ రెడ్డి, మురళీమోహన్ ఈ పిటిషన్ ను దాఖలు చేయగా, ఈరోజు మధ్యాహ్నం 2:30 గంటలకు ఈ పిటిషన్ ను హైకోర్టులో విచారించబోతున్నట్టుగా తెలుస్తోంది.

# ఆర్బీఐ గవర్నర్ గా మల్హోత్రా బాధ్యతల స్వీకరణ



ముంబై : నూతన గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బుధవారం బాధ్యతలు చేపట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ ను మోదీ సర్కారు తీసుకొచ్చింది. నిన్న దాస్ పదవీ విమరణ చేయడంతో.. ఆర్బీఐ తదుపరి గవర్నర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. నేటి నుంచి మూడేళ్ల పాటు బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేశారు. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని సైతం పొందారు. 33 ఏళ్ల తన కెరియర్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ శాఖల్లో మరెన్నో బాధ్యతల్ని నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విద్యుత్తు, ఆర్థిక, పన్నులు, ఐటీ, గనులు తదితర రంగాల్లో సమర్థవంతంగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తుండగా, అంతకుముందు ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించారు.

### స్కూళ్లకు మూడు రోజులు

# సెలవులు

హైదరాబాద్ : క్రిస్మస్ సందర్భంగా స్కూళ్లకు మూడు రోజులు సెలవులు ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 24న క్రిస్మస్ ఈవ్, 25న క్రిస్మస్, 26న బాక్సింగ్ డే నేపథ్యంలో సెలవులుగా పేర్కొంది. గతంలో క్రిస్మస్‌కు 5 రోజులు సెలవులు ఇవ్వగా ఈసారి ప్రభుత్వం 3 రోజులకు కుదించింది.

# కాంగ్రెస్ ఎంపీల వినూత్న నిరసన

### రాజ్‌నాథ్ కు గులాబీ పువ్వు ఇచ్చిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : అదానీపై అమెరికాలో నమోదయిన లంచం అభియోగాలతో పాటు పలు కీలక అంశాలపై చర్చించాలంటూ పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇవాళ (బుధవారం) వినూత్న నిరసనకు దిగారు. పార్లమెంట్ ఆవరణలో ఎన్డీయే ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులు గులాబీ పూలు, తిరంగా జెండాలను అందించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గులాబీ పువ్వు, తిరంగా జెండాను అందించారు. మకర ద్వారం మెట్ల వద్ద వేచివుండి రాజ్‌నాథ్ సింగ్ రాగానే నవ్వుకుంటూ దగ్గరికి వెళ్లి గులాబీ చేతికిచ్చారు. దానిని స్వీకరించిన మంత్రి పార్లమెంట్‌లోకి వెళ్లారు.

**కాగా ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు, డీకేఎంకే, జేఎంఎం, వామపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు కూడా జాతీయ జెండాలు, ఎర్ర గులాబీలను పట్టుకుని నిలబడ్డారు. ఈ నిరసనపై కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్ మాట్లాడుతూ... జాతీయ జెండాను పంపిణీ చేసి ఈ దేశాన్ని విక్రయించవద్దని, దేశాన్ని ముందుకు నడిపించాలని ఎన్డీయే ఎంపీలను అభ్యర్థించామని ఆయన అన్నారు. దురదృష్టవశాత్తు అదానీ ఈ దేశాన్ని నడుపుతున్నట్టుగా గమనించవచ్చని అన్నారు. అదానీకి అన్నీ ఇచ్చి పేదల గొంతుకను నొక్కుతున్నారని, దేశాన్ని విక్రయించే కుట్రకు తాము వ్యతిరేకమని గైక్వాడ్ అన్నారు. అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ నేతృత్వంలో రోజువారీగా చేపడుతున్న నిరసన ప్రదర్శనల్లో ఇది మరో ఆందోళన అని ఆయన తెలిపారు.**



**అదానీ వ్యవహారంతో పాటు అన్ని ముఖ్యమైన అంశాలపై సభలో చర్చకు విజ్ఞప్తి చిహ్నంగా ఈ నిరసన చేపట్టామని వివరించారు.**

కాంగ్రెస్ ఎంపీలు గులాబీ పూలు పంపిణీ చేయడంపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ధ్వజమెత్తారు. ఇదంతా డ్రామా అని, పిల్లచేష్టల విధానాలని విమర్శించారు. రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ కూడా ప్రతిపక్ష నేతలుగా ఉన్నారని, ఈ విధంగా పార్లమెంట్ వెలుపల వీడియోలు చిత్రీకరించడం ఎప్పుడైనా చూశారా? అని ప్రశ్నించారు. మరోవైపు, ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే రాజ్యసభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై అభిశంసన నోటీసు, సోనియా గాంధీ-సోరోస్ వ్యవహారాల నేపథ్యంలో సభలో ఆందోళనలు నెలకొనడం ఇందుకు కారణమైంది.

# బాలీవుడ్ నటుడు కిడ్నాప్

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ కు గురయ్యాడు. మీరట్‌లో నిర్వహించే ఈవెంట్‌కు హాజరుకావాలంటూ ముస్తాక్ ఖాన్‌కు ఆహ్వానం అందింది. ఢిల్లీ వరకు ఫ్లయిట్ ఛార్జీలు చెల్లిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా అతని అకౌంట్లో కొంత పేమెంట్ చేశారు. నవంబర్ 20న మీరట్‌లో జరిగే అవార్డు ఫంక్షన్‌కు ఆహ్వానిస్తున్నామని చెప్పి ఢిల్లీకి రప్పించారు. విమానం దిగిన తర్వాత సీన్ మారింది. ఓ వాహనంలో నటుడిని తీసుకుని కొంత దూరం వెళ్లారు. అక్కడ మరో వాహనంలోకి ఎక్కించారు. ఆ తర్వాత 12 గంటల పాటు కిడ్నాపర్లు అతన్ని బంధించారు. కోటి ఇవ్వాలంటూ కిడ్నాపర్లు చిత్రహింస పెట్టారు. కానీ ఖాన్, అతని కుమారుడి అకౌంట్ల నుంచి కేవలం రెండు లక్షలు మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలుస్తోంది. కిడ్నాపర్ల వద్ద ఉన్న సమయంలో.. మసీదు అజా విన్న అతను అక్కడికి పారిపోయాడు. స్థానికులకు తన పరిస్థితి చెప్పి సాయం కోరాడు. పోలీసుల సహాయంతో అతను సొంత ఇంటికి వెళ్లాడు. ప్రస్తుతం ముస్తాక్ ఖాన్ క్షేమంగా ఉన్నారు.

